క్లుప్తంగా

వైభవంగా కలశస్థాపన



కలశంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

మద్దికెర: స్థానిక షిర్డీ సాయిబాబా దేవాలయంలో ఆదివారం కలశస్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ముందుగా అర్చకులు హోమ పూజలు చేశారు. అనంతరం మంత్రోచ్చరణల మధ్య కలశంతో ఆలయ ప్రదక్షిణలు చేసి గోపురంపై కలశస్థాపన చేశారు. ఆలయ నిర్వాహకులు రామాంజులు, రవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నెరణికి తండాలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులకు అవగాహన కలిగిస్తున్న సెబ్ సీఐ, ఎస్ఐ

హొళగుంద: ఈ నెల 24న దేవరగట్టులో జరిగే దసరా బన్ని ఉత్సవంలో భాగంగా ఆదివారం ఆలూరు సెబ్ సీఐ ఎర్ర వెంకట్, ఎస్ఐ శ్రీనివాసులు, ఆధ్వర్యంలో సిబ్బంది నెరణికి తండా గ్రామంలో సోదాలు నిర్వహించారు. 10 రింగు కర్రలు, 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం గ్రామంలో బన్ని ఉత్సవంలో రింగు కర్రలు వాడడం, సారా సేవించి ఉత్సవంలో పాల్గొనడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. విగ్రహాల ఊరేగింపులో అగ్గి కాగడాలను భక్తులపై విసరడం, అల్లర్లకు దిగడం లాంటి పనులు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సంప్రదాయ పద్ధతిలో భక్తిశ్రద్ధలతో పండగ జరుపుకోవాలని సూచించారు.

నిత్యావసర సరుకుల అందజేత



సరుకులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దివాకర్‌నాయుడు

దేవనకొండ: నేపాల్ నుంచి వలస వచ్చి స్థానికంగా గుర్కా పనులు చేసుకుంటూ జీవిస్తున్న రానాబహదూర్ భార్య పార్వతి పది రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేలు విలుచేసే వంద కేజీల బియ్యం, 10 కేజీల కందిబేడలు, ఐదు కేజీల చక్కెర, 14 లీటర్ల మంచినూనె, ఇతర సరుకులు అందజేశారు. మృతురాలికి ఐదుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం. సహకార సొసైటీ సీఈఓ రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నయ్యశెట్టి, పల్లెదొడ్డి చంద్రన్న, తిరుమలేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు

హాలహర్వి: హంద్రీ–నీవా ఆయకట్టు కింద రైతులు సాగుచేసిన పంట పొలాలకు నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు అన్నారు. బెల్డోణ, మల్లికార్జునపల్లె పంట పొలాల్లో రైతులకు నీటి సమస్య నెలకొంది. పైన నాన్‌ఆయకట్టు రైతులు మోటార్ల ద్వారా కాలువల్లోని నీటిని తోడేయడంతో కింద ఉన్న ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు వారిని కోరారు. నాయకులు మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల రైతులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హాలహర్వి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భీమప్పచౌదరి, సర్పంచ్ బాలరాజు, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ఫాగింగ్

హొళగుంద: గత కొద్ది రోజులుగా మార్లమడికి, ముద్దటమాగి గ్రామాల్లో దోమల బెడద తీవ్రం కావడంతో ఆదివారం ఆ గ్రామాల వీధుల్లో ఫాగింగ్ చేపట్టారు. దోమల కారణంగా విషజ్వరాలు వ్యాపించకుండా ఫాగింగ్ చేపట్టామని సర్పంచ్ యంకప్ప తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రతి రోజూ రాత్రి వీధుల్లో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. గ్రామస్తులు చెత్తచెదారం, మురుగు నీరు బయటకు వదలకుండా సహకరించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



దుర్గాదేవి అలంకరణలో గాయత్రీ మాత



తుగ్గలిలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



వెల్దుర్తిలో దుర్గాదేవిగా వాసవీకన్యకా పరమేశ్వరి



మహాగౌరి దేవి అలంకరణలో వాసవీ మాత



మద్దికెరలో పూజలందుకుంటున్న చౌడేశ్వరీ దేవి

జయ జయహే మహిషాసురమర్దిని





కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, రామతీర్థంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నందవరం: జయ జయహే మహిషాసురమర్దిని అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 8వ రోజు ఆదివారం మండలంలోని అమ్మవార్లు మహిషాసురమర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దక్షిణ కాశీ క్షేత్రంగా పేరు గాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి దేవి ప్రత్యేక అలంకరణలో కొలువుదీరారు. అర్చకులు హంపేష్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, జలాభిషేకాలు, కుంకుమార్చన, మంగళహారతులు గావించారు. టి.సోమలగూడూరులో పెద్దమ్మ తల్లికి పురోహితుడు శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిషాసురుడి సంహారంలో రౌద్రాన్ని ప్రతిబింబించేలా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవతమూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ గావించారు.

ఎమ్మిగనూరుటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీవరాహిదేవి రూపంలో దర్శనమివ్వగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి, ఆయన తనయులు పవన్‌కళ్యాణ్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, తారా రాజశేఖర్, తిరుమల్, కేపీ వీరన్న శెట్టి, హరి కుమార్ పాల్గొన్నారు.

మద్దికెర: స్థానిక చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి మహామంగళ హారతి ఇచ్చారు. పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అలాగే మండల పరిధిలోని శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో సతీసమేత శ్రీదేవి, భూదేవి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణలతో పాటు గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

తుగ్గలి: దేవీ నవరాత్రి ఉత్సవాలను తుగ్గలిలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. ప్రత్యేక అర్చనలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఆదివారం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో ఆదివారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయమే అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెల్దుర్తి: స్థానిక అమ్మవారి శాలలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, పాతబస్టాండు సమీపంలో గణేశ్‌ట్రేడర్స్ పక్కన సందులో మండపంలో ఏర్పాటు చేసిన అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ప్రత్యేకాలంకరణలోని అమ్మవార్లకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం నాటి సంత, సోమవారం నాటి దసరా పండుగను పురస్కరించుకుని పట్టణంలో కొనుగోళ్లకు వచ్చిన ప్రజలతో పాతబస్టాండు ప్రాంతం క్రిక్కిరిసింది.

ఆలూరు రూరల్: దేవి శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. దుర్గాష్టమి పురస్కరించుకుని మండలంలోని కమ్మరచేడు గ్రామంలో కొలువైన అంబాదేవి దుర్గా మాత అవతారంలో భక్తులకు దర్శమిచ్చారు. ఉదయం అమ్మవారికి గంగ పూజ, ఆకు పూజ,పంచామృతాభిషేకం,కుంకుమార్చన, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా వెంకట రెడ్డి దుర్గా పురాణం పఠించారు. మల్లికార్జున రెడ్డి,గోపాల్ శ్రీధర్ రెడ్డి భక్తులు ఉన్నారు.

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత, పార్వతీ దేవి, ఆస్పరిలోని కన్యకా పరమేశ్వరీ మాత దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలలో వేదపండితులు అనిల్‌కుమార్ శర్మ, పూజారులు రూపామోహన్‌శర్మ, మల్లికార్జునస్వామి, శాంతి రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.



టి.సోమలగూడూరులో మహిషాసురమర్దినిగా పెద్దమ్మ తల్లి



కమ్మరచేడులో దుర్గామాత అలంకరణలో అంబాదేవి

ఆలూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవీని దసరా ఉత్సవాలలో భాగంగా ఆదివారం మహాగౌరిగా అలంకరించారు. ఆలయ అర్చకులు నరేంద్ర శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, ఫల, పుష్ప పంచామృతాభిషేకం, మహామంగళ హారతి పూజలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

పట్టణంలో పండగ శోభ

- కిక్కిరిసిన వ్యాపార సముదాయాలు
- ముస్తాబైన దేవాలయాలు
- నేడు దసరా సంబరాలు

ఎమ్మిగనూరు: దసరా పండుగ కోలాహలం మొదలైంది. సోమవారం జరిగే దసరా ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక పక్క దేవీ నవరాత్రులు, పండుగ ఉత్సవాలు జరుగుతుండటంతో పట్టణం, పల్లెల్లో సంబరాలు కనువిందు చేస్తున్నాయి. కులమతాలకు అతీతంగా ప్రజలు పండుగల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు నిర్వహిస్తున్న వారంతా సొంత ఊళ్లకు చేరుకోవడం, ఆడపచులు, బంధువులు రావడంతో ప్రతి ఇల్లు ఉమ్మడి అనుబంధాలతో కళకళలాడుతోంది. ఎమ్మిగనూరు పట్టణంతోపాటు గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లోని వివిధ ప్రసిద్ధ దేవాలయాలు పండుగకు ముస్తాబయ్యాయి. ఆదివారం సంత రోజు, పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో ఎమ్మిగనూరు పట్టణం కిక్కిరిసిపోయింది. బట్టల దుకాణాలు, టైలరింగ్ షాపులు, కూరగాయల మార్కెట్, పూలబజార్, మామిడాకుల తోరణాలు, అలంకార వస్తువుల దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. పండుగ సరుకుల కోసం కిరాణం దుకాణాలు, ఫ్యాన్సీ జనరల్ స్టోర్‌ల వద్ద జన సమూహాలు కనిపించాయి.

ముస్తాబైన ఆలయాలు

దసరా ఉత్సవాల కోసం ప్రధాన ఆలయాలు, అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి, మార్కండేయ స్వామి, ఈశ్వర స్వామి దేవాలయాలు, కన్యకాపరమేశ్వరీ, గాయత్రీదేవీ, అంబాభవానీ, సుశీలాంబదేవీ ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే ఎమ్మిగనూరు మండలంలో చెన్నకేశవ స్వామి, నందవరం మండలంలో గురుజాల రామలింగేశ్వర ఆలయాలను ముస్తాబు చేశారు. సోమవారం తెల్ల వారుజామునుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు పేర్కొంటున్నారు. అనాది కాలంగా దసరాకు ప్రత్యేకత ఉందని, విజయదశమి రోజు ఏ కార్యాన్ని మొదలు పెట్టినా విజయవంతం అవుతుందని వివరిస్తున్నారు. ఉదయం దేవాలయాల్లో, ఇళ్లలోని పూజగదుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం శమీ (జమ్మి చెట్టు) వృక్షం వద్ద పూజలు చేయాలని, అనంతరం పండితులు, తల్లిదండ్రులతోపాటు పెద్దవారికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకుంటే యేడాది పొడవునా శుభ పరిణామాలు జరుగుతాయని పండితులు పేర్కొంటున్నారు.



పూజకు పూలు.. భలే గిరాకి



ముస్తాబైన అమ్మవారి ఆలయం



అలనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

మద్దికెర: మిత్రమా.. కుశలమా అంటూ 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తిరిగి కలుసుకుని అప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారు 20 ఏళ్ల తరువాత పాఠశాలలో తిరిగి కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యనేర్పిన గురువులు ఖాజాహుస్సేన్, రామాంజులు, మహమ్మద్‌లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులు ఆకుల రంగనాథ్, శ్రీధర్, నారాయణ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ పూజ

తుగ్గలి: విజయదశమి పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్లలో ఎస్ఐలు మల్లికార్జున, రామాంజినేయులు ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



నాగలదిన్నెలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది

నందవరం: ప్రశాంతమైన పల్లెల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సీఐ నేతృత్వంతో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో అల్లర్లకు పాల్పడితే ఎట్టివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలని, గొడవలు పడి జైలు జీవితం అనుభవించొద్దని సూచించారు. అందురూ అన్నదమ్ములుగా జీవించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మట్కా, గుట్కా, పేకాట తదితర కార్యకలపాలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. ఎస్ఐ తిమ్మయ్య, గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి, ఏఎస్ఐ ఆనంద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కురవ సంఘం మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

హొళగుంద: మండల కేంద్రంలో ఆదివారం మాదాసి, మాదారి కురువ సంఘం మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికై ఓంది. ఆంధ్రప్రదేశ్ మాదాసి, మాదారి కురువ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెద్దయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంమోహన్ ఆధ్వర్యంలో ఆలూరు తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్యాట మల్లయ్య సమక్షంలో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కాళికప్రసాద్, గౌరవ సలహాదారులుగా కోగిలతోట శేషప్ప, బొజ్జన్న, డాక్టర్ రామాంజనేయులు, అధ్యక్షుడిగా పంపన్న, ఉపాధ్యక్షులుగా రవిస్వామి, బసవరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లార్తి లక్ష్మన్న, నిర్వహాక అధ్యక్షుడిగా వందవాగిలి గర్జప్ప, కోశాధికారిగా మైలారి, సహాయ కార్యదర్శిగా గాదిలింగ, కార్యవర్గ సభ్యులుగా నెరగల్లప్ప, శివకుమార్, సిద్దప్ప, రామకోటి, లింగంపల్లి వీరేష్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, ఆలూరు తాలూకా ప్రధాన కార్యదర్శులు రాంమోహన్, పెద్యాట మల్లయ్య మాట్లాడుతూ.. మాదాసి, మాదారి కురువలను ఎస్టీ జాబితాలో చేర్చి, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, బీరప్ప ఆలయ పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గౌరవయ్యలను కళాకారులుగా గుర్తించి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. నాయకులు ఎస్కే గిరి, ఎండీ హళ్లి సర్పంచ్ సుధాకర్, శేషప్ప, గాదిలింగప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా



హులేబీడులో ఎండిన వేరుశనగ పైరును పరిశీలిస్తున్న ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

ఆలూరు: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఆత్మగౌరవ యాత్ర అనంతపురం జిల్లా నుంచి కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోకి ఆదివారం ప్రవేశించింది. అందులో భాగంగా చిప్పగిరి, ఆలూరు మండల కేంద్రాలు, వివిధ గ్రామాల్లో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, కంది తదితర పంటలను గిడుగు రుద్రరాజు ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలన్నీ ఎండిపోయి దిగుబడులు రాక రైతులు అప్పుల పాలయ్యారన్నారు. రాయలసీమ జిల్లాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు బీమారెడ్డి, కృష్ణ, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

ఆస్పరి: మండలంలోని బైలుపత్తికొండ గ్రామంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన నాగార్జున (29) కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైనట్లు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వీరప్రతాప్ తెలిపారు. ఆదివారం మృతుడి భార్య జయలక్ష్మికి తక్షణ సహాయం కింద రూ.10 వేలు నగదును వెల్ఫేర్ అసిస్టెంట్ అందజేశారు. మిగతా సొమ్ము త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకన్న, రంగన్న పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజారులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రాకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన మాళమల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24న బన్నీ (కర్రల ఉత్సవం)కి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. బన్ని ఉత్సవంలో పాల్గొనే లక్షలాది మంది భక్తులకు తాగు నీరు, విద్యుత్ సదుపాయం, వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్, మీడియా పాయింట్, 108 అంబులెన్స్ వాహనాలు, అగ్ని మాపక వాహనాలు, వైద్య శిబిరాలు, భక్తులకు భోజన వసతి, ఉన్నతాధికారులకు విడిది తదితర ఏర్పాట్లు దాదాపు పూర్తిచేసినట్లు చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి ఆ మేరకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు.

జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న దూదేకుల సంఘం నాయకులు

పత్తికొండ రూరల్: ఈనెల 29న గుంటూరులో జరగనున్న దూదేకుల సింహగర్జన జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహబుబ్‌బాషా పిలుపునిచ్చారు. ఆదివారం పత్తికొండలోని అంబేడ్కర్ కూడలిలో దూదేకుల పింజరి నూర్‌బాషా ముస్లిం మైనారిటీ సంఘం రాష్ట్ర సెక్రటరీ సుబాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులతో కలిసి సింహగర్జన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో దూదేకులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల నుంచి దూదేకులు పెద్ద ఎత్తున సమావేశానికి హాజరు కావాలని కోరారు. సంఘం నాయకులు చెన్నంపల్లి హుసేన్‌పీర, కనకదిన్నె హుసేన్, ఇమాంసాహెబ్, మధ్యాన్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.